
వరి సాగుకు ట్రాక్టర్‌తో కయ్యలు సిద్ధం చేస్తున్న రైతు


పొగాకు, పత్తి, జామాయిల్ పంటల్లో అంతర సేద్యానికి వినియోగించే ట్రాక్టర్


పొగాకుకు ట్రాక్టర్‌తో పురుగు మందు పిచికారీ

సాగులో యంత్ర సాయం

ఆత్మకూరురూరల్: వ్యవసాయ పనులకు కూలీల కొరత అధికమవడంతో రైతులు యంత్ర సాయాన్ని ఆశ్రయిస్తున్నారు. కాడెద్దుల స్థానంలో ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. రబీ పంట సాగుకు కయ్యలను తొక్కించడం, చదును చేయడం, గట్లు చెక్కడం,తదితర పనులను ట్రాక్టర్లతోనే చక్కబెడుతున్నారు. నాట్లు వేసేందుకు స్థానికంగా కూలీల కొరత ఉండడంతో ఇతర రాష్ట్రాల కూలీలపై ఆధార పడుతున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన కూలీలను తీసుకొచ్చుకుని నాట్లు వేయించుకుంటున్నారు.పొగాకు, మిరప, శనగ, మినుము, జామాయిల్, తదితర పంటల సాగులోనూ యంత్రాలనే వినియోగిస్తున్నారు. దుక్కి దున్నడం,విత్తనాలు చల్లడం, పురుగు మందులు పిచికారీ, పంట నూర్పిళ్లు, తదితర పన్నులను యంత్రాలతోనే చేపడుతున్నారు.

క్లుప్తంగా

నేడు మేకపాటి విక్రమ్‌రెడ్డి పర్యటన

ఆత్మకూరు: ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు, సంగం మండలాల్లో సోమవారం పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. సాయంత్రం 4 గంటలకు ఆత్మకూరు మండలం పడకండ్లలో నూతనంగా వివాహం చేసుకున్న తుమ్మల చంద్రారెడ్డి దంపతులను ఆశీర్వదించనున్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన వలంటీర్‌గా పనిచేసిన కార్తీక్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. సంగం మండలంలో ఇటీవల తల్లిని పోగొట్టుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఊటుకూరు జనార్దన్‌రెడ్డి, తండ్రిని పోగొట్టుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దుగ్గి అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.

రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో ప్రత్యేక పూజలు



సంగం: పౌర్ణమి సందర్భంగా స్థానిక తిరుమన కొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు గంధ మహోత్సవం

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న దర్గాలో సోమవారం గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు చేర్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు పంచిపెట్టనున్నట్లు చెప్పారు. గంధ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

పూజా ప్రాంగణంగా చెత్త డంపింగ్ ప్రదేశం



కావలి: పట్టణంలోని పాతూరులోని రాజీవ్‌గాంధీ విగ్రహం కూడలి ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ కూడలిలో రాత్రి వేళల్లో చెత్తను పడేస్తుండడంతో పందులు స్వైరవిహారం చేస్తుండేవి. పరిసరాలు దుర్గంధం వెదజల్లుతూ అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ పరిస్థితిని నివారించడానికి మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. అంతిమంగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తులసికోటను ఏర్పాటు చేసి చుట్టూ కర్రలతో కంచె నిర్మించడంతో ఆ ప్రదేశం పూజా ప్రాంగణంగా ఆవిష్కృతమైంది. దీంతో చెత్త పడేసే వారు మానుకున్నారు. ఫలితంగా చెత్త, దుర్గంధం, పందుల నుంచి విముక్తి లభించిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా నాగులవెలటూరు రోడ్డు



చేజర్ల: మండలంలోని నాగులవెలటూరు రోడ్డు అధ్వానంగా తయారైంది. కలువాయి మెయిన్ రోడ్డు నుంచి నాగులవెలటూరు వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు తారులేచి పోయి అడుగడుగునా గుంతలతో నిండింది. దీంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు నరకాన్ని చవిచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా రోడ్లను పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చాకలకొండ చెరువుకు జలకళ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం చాకలకొండ చెరువు జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపు రెండు నెలలకుపైగా సరిపడా సాగునీరు చేరడంతో ఆయకట్టు రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. పిల్లాపేరు నుంచి చెరువుకు ఉన్న వరద కాలువ అక్కడక్కడా మరమ్మతులకు గురవడంతో సక్రమంగా సాగునీరు చేరడం లేదు. ఈ కాలువకు మరమ్మతులు చేస్తే పిల్లాపేరు నీరు చెరువుకు చేరుతుందని, వరి సాగుకు ఢోకా ఉండదని రైతులు వాపోతున్నారు.

వర్షం వస్తే రాకపోకలు బంద్

ఆ మార్గం మూడు మండలాలను కలుపుతుంది. అంతటి కీలకమైన మార్గంలో రెండు మండలాల మధ్యన కిలోమీటర్ దూరం రోడ్డు, వంకపై చప్టా నిర్మాణంపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వర్షం పడితో వంకలో నీరు నిల్వ ఉండి రాకపోకలు నిలిచిపోతుండడంతో మూడు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


చింతమాను వంకలో నిల్వ ఉన్న నీరు

ఉదయగిరి : వరికుంటపాడు మండలం రామదేవులపాడు, వింజమూరు మండలం జనార్దనపురం మధ్యన కిలోమీటర్ దూరం ఉంటుంది. పదేళ్ల క్రితం వరికుంటపాడు నుంచి రామదేవులపాడు వరకు తారురోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి జనార్దనపురానికి తారురోడ్డు నిర్మించలేదు. రెండు గ్రామాల మధ్యన చింతమాను వంక ఉంది. ఈ వంకపై దిగువ భాగంలో నిర్మించిన చెక్ డ్యామ్‌లో వర్షం పడి నీరు నిల్వ ఉంటే రోడ్డు మునిగిపోతుంది. వర్షాకాలంలో సుమారు మూడు నెలల పాటు కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. వింజమూరు, కొండాపురం మండలాల నుంచి వరికుంటపాడు మండలానికి వెళ్లేందుకు ఈ మార్గం అత్యంత దగ్గరగా ఉంటుంది. అదే విధంగా వరికుంటపాడు మండలం నుంచి వింజమూరు, కొండాపురం, కలిగిరి, కందుకూరు, మాలకొండ వెళ్లేందుకు ఈ రోడ్డు చాలా అనుకూలంగా ఉంటుంది. కానీ వర్షకాలంలో వంకపై బ్రిడ్జి లేని కారణంగా రాకపోకలు నిలిచిపోతుండడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చింతమాను వాగుపపై చెక్‌డ్యామ్ నిర్మించారు. చెక్‌డ్యామ్ బ్యాక్ వాటర్ రోడ్డుపై మూడు నెలలు పాటు నిల్వ ఉంటుండడంతో రాకపోకలు సాధ్యం కావడం లేదు. వంకపై బ్రిడ్జి, తారురోడ్డు నిర్మాణం చేపట్టే వరకు అయినా నీరు నిల్వ లేకుండా చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రోడ్డు సమస్యపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు అర్జీలు ఇచ్చినా స్పందన లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని మూడు మండలాలను కలిపే అత్యంత కీలకమైన రోడ్డును అభివృద్ధి చేసి బ్రిడ్జి నిర్మించాలని వారు కోరుతున్నారు.


రామదేవులపాడు-జనార్దనపురం మధ్యన అభివృద్ధికి నోచుకోని రోడ్డు

వంకపై చప్టా నిర్మించాలి



జనార్దనపురం-రామదేవులపాడు మధ్యన ఉన్న చింతమాను వంకపై చప్టా నిర్మించి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలి. వంకపై దిగువ భాగంలో నిర్మించిన చెక్‌డ్యామ్ బ్యాక్ వాటర్ రోడ్డుపై చేరుతుండడంతో వర్షాకాలంలో మూడు నెలలు పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో వింజమూరు మండలంలోని గ్రామాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

– రాంబాబు, రామదేవులపాడు,

ప్రతిపాదనలు పంపుతాం



రోడ్డు సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. కి.మీ దూరం రోడ్డు నిర్మాణం చేస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదు. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా చూస్తాం.

–వేణుగోపాల్,ఎంపీడీఓ

దుమ్ము,ధూళితో అవస్థ



కావలి: దగదర్తి మండలం దామవరం వద్ద చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారి మట్టిరోడ్డును తలపిస్తోంది. కావలి– నెల్లూరు మధ్యన ఆరులేన్లుగా జాతీయ రహదారి ఉంది. జాతీయ రహదారి నిర్వహణను ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోంది. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన సదరు సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దామవరం వద్ద జాతీయ రహదారిపై మట్టి పేరుకుపోయి మట్టిరోడ్డులా తయారైనా పట్టించుకోడం లేదు. దీంతో దుమ్ము, ధూళితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారుల నుంచి టోల్‌ఫీజుల రూపంలో కోట్లాది రూపాయలను వసూలు చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థ హైవే నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై వాహనదారుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తీరానికి చేరుకునేదెలా?



కావలి: కావలి మండలం తుమ్మలపెంట సముద్ర తీరానికి చేరుకునేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. సముద్ర తీరానికి చేరుకునేందుకు ఇసుక దారి, అది కూడా ఇరుకుగా ఉండడంతో అటు స్థానిక మత్స్యకారులకు, ఇటు పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మించడానికి నిధులు లేకపోయినా, కనీసం గ్రావెల్ రోడ్డు అయినా నిర్మించి ఇసుక దారిలో పడుతున్న బాధల నుంచి విముక్తి కల్పించాలని వారు కోరుతున్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం


సోమశిల: చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..


కావలి: పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఆత్మకూరు: మేకపాటి కార్యాలయంలో..


ఆత్మకూరు: రవాణా శాఖ కార్యాలయంలో..


ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలో...


చేజర్లలో..


సంగం జెడ్పీహైస్కూల్‌లో..

కావలి: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కనమర్లపూడి వెంకట నారాయణగుప్తా పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనమర్లపూడి మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేపట్టి అమరుడైన పొట్టిశ్రీరాములును స్మరించుకోవడం తెలుగు ప్రజల కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం రాములు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కే వెంకట రమణమ్మ, కమిషనర్ సీ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన త్యాగాన్ని స్మరించుకున్నారు. పట్టణంలోని మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, గౌస్‌బాషా, నాయకులు చంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, చిన్నపరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన తాగ్యాన్ని స్మరించుకున్నారు. మాజీ ఎంపీపీ రావి పెంచలరెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రాశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వెంగళరావు, మనోహర్, పూజిత, నిహారిక, తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయ ఆవరణల్లో ఆర్యవైశ్య నాయకుల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహం, చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గునుపూడి గిరిబాబు, వేమా మల్లికార్జునరావు, రాజా, దుగ్గి అనిల్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములును స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు కారణభూతుడయ్యారన్నారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. అధ్యాపకులు జీ రమేష్, దుర్గాప్రసాద్, గోపీకృష్ణ, రఘునాథ్‌రెడ్డి, కిషన్‌తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు పాలూరు కొండారెడ్డి, ములకా శ్రీనివాసులురెడ్డి, మూలె రాధాకృష్ణారెడ్డి, ఖాజామొయినుద్దీన్, పుల్లా రవి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


కలిగిరిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఉదయగిరిలోని ఎంజీఆర్ వ్యవసాయ కళాశాలలో..


సంగంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు


నిరుపయోగంగా వదిలేశారు

ఆత్మకూరురూరల్: మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం కూడలి సమీపంలో ఉన్న పంచాయతీరాజ్‌కు చెందిన కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని ఆ శాఖకు చెందిన అధికారులు నిరుపయోగంగా వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన అతిథి భవనాలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. వాటిని తొలగించకుండా గత కొన్నేళ్లుగా అలాగే వదిలేయడంతో పిచిచెట్లు అల్లుకుపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. ఆత్మకూరు పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ డివిజన్ కేంద్రంగా ఉంది. గతంలో పీఆర్ ప్రాజెక్ట్ అధికారులు ఆత్మకూరు నుంచే విధులు నిర్వహించే వారు. పీఆర్ భవనాలు శిథిలావస్థకు చేరిన తరువాత వారు నెల్లూరులోని కార్యాలయం నుంచి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. నెల్లూరుపాళెం కూడలిలోని కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని నిరుపయోగంగా వదిలేసి నెల్లూరు నుంచి కార్యకలాపాలు నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మకూరు డివిజన్ పరిధిలో జరిగే రోడ్డు పనులను నెల్లూరు నుంచి పర్యవేక్షించడం ఎంత వరకు సబబు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి నూతన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన పంచాయతీరాజ్ అతిథి గృహం

బాతుల చక్కర్లు

రబీ సాగుకు సిద్ధం చేసిన పొలాల్లో బాతులు చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు నిల్వ చేరడంతో బాతులను వాటి పెంపకందారులు వదిలిపెట్టారు. నాట్లు వేయదానికి సిద్ధంగా ఉన్న పొలాల్లో బుడకొడుతూ మేత కోసం వేట సాగిస్తూ సందడి చేస్తున్నాయి. ఈ దృశ్యం కావలి మండలం ఆముదాలదిన్నె గ్రామంలో కనిపించింది. –కావలి



బంతి కనువిందు





కార్తీక మాసం నుంచి సంక్రాంతి వరకు బంతి పూలకు డిమాండ్ ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కావలి మండలంలోని పలు గ్రామాల్లో బంతి తోటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం బంతి పూలు విరగబూస్తున్నాయి. ఎరుపు, పసుపు వర్ణంలోని బంతి పూలతో తోటలు కనువిందు చేస్తున్నాయి. –కావలి